ప్రజాశక్తి
ఆదివారం 21 జూలై 2024
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న లక్ష్మయ్య వాగు



ఉధృతంగా వాగులు

❁ప్రకాశం బ్యారేజికి వరద ❁విరిగిపడిన కొండ చరియలు

ప్రజాశక్తి - యంత్రాంగం : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో శనివారం కూడా విస్తారంగా వర్షాలు కురిశాయి. పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగుకు వరద చేరి 5 అడుగుల మేర నీరు రోడ్డుపై గుండా ప్రవహించింది. దీంతో చెవిటికల్లు -కంచికచర్ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరు, కట్టెలేరు, వైరా ఏరులకు వరద నీరు చేరింది. మునేరుకు వరద పెరిగి కీసర వద్ద కృష్ణానదిలో కలుస్తోంది. వర్షాలకు కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పెసర, మొక్కజొన్న, పత్తి పొలాల్లో నీరు నిలబడింది. కృష్ణాజిల్లా మొవ్వ మండలం అవురిపూడి, కాజ గ్రామాల్లో సుమారు 100 ఎకరాలకుపైగా వరి నారు నీటమునిగింది. బంటుమిల్లి మండలంలో నీట మునిగిన 150 ఎకరాల వరి పొలాలను రైతు సంఘం నేతలు పరిశీలించారు. విజయవాడ 45వ డివిజన్ కబేళా సెంటర్ తిరుపతమ్మ గుడి ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంటలకు కొండ చరియలు విరిగిపడి వల్లభాపురం కోటేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇంటి గోడ కూలిపోయింది. దీంతో కొండ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

ప్రకాశం బ్యారేజికి వరద

ఎగువన కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఉదయం 6 గంటలకు బ్యారేజ వద్ద ఇన్‌ఫ్లో 7,519 క్యూసెక్కులుగా, అవుట్‌ఫ్లో 7,149 క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజ పూర్తిస్థాయి నీటి మట్టం 12 అడుగులకు చేరడంతో మొత్తం 70 గేట్లకుగాను ఎనిమిది గేట్లను అడుగు మేర పైకెత్తి 5,840 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి, మరో 1,309 క్యూసెక్కుల నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నారు. వరద నేపథ్యంలో దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యారేజి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హెచ్చరించారు.



బంటుమిల్లి మండలంలో ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం, సిఐటియు నేతలు గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఎల్.అజయ్ ఘోష్, ఎం.శ్రీనివాసరావు

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వర్షాల నేపథ్యంలో కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నంలోని కష్ణాజిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08672-252572. వర్షాలు, వరదల పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా, డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు.



గోతులు పడిన రోడ్డుపై ఎంఎల్ఎ నిరసన

ప్రజాశక్తి - తిరువూరు : గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డుపై శనివారం అధికార పార్టీకి చెందిన తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు నిరసన తెలిపారు. గోతులు పడిన రోడ్డుపై వర్షంలోనే స్టూల్ వేసుకుని కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎడతెరిపిలేని వర్షంతో తిరువూరు పట్టణంలో ప్రజలు పడుతున్న అవస్థలు తెలుసుకునేందుకు ఆయన సైకిల్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డు నుండి కోకిలంపాడు రోడ్డు మధ్యలో ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల్లో నిలిచిన వర్షం నీటిని చూశారు. అర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్య వైఖరికి అక్కడే రోడ్డుపై స్టూల్ మీద కూర్చుని నిరసన తెలిపారు. అర్ అండ్ బి అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అర్‌అండ్‌బి ఏఈ వచ్చి హామీ ఇవ్వటంతో నిరసన విరమించారు.

కొండ ప్రాంత ప్రజల రక్షణ, అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరంలో కొండ ప్రాంత వాసుల రక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం రూ.100 కోట్ల ప్యాకేజీ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ తక్షణమే రూ.10 కోట్లు కేటాయించాలని కోరారు. కొండలపై బిక్కిబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న కొండ ప్రాంత ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. విజయవాడ పశ్చిమ నియోజక వర్గం పాతబస్తీ 50, 51వ డివిజన్లలోని కొండ ప్రాంతాలో సిహెచ్.బాబురావు, సిపిఎం పశ్చిమ (మిగతా 2లో)



విజయవాడ వన్‌టౌన్ కొండ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, బోయి సత్యబాబు, సూరిబాబు తదితరులు



అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్లకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌక ర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. వర్షాల వల్ల సంభవించే వరదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బందితో ఫోన్లో మాట్లాడారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాలను, నది, కాల్వ గట్లను బలోపేతం చేయాలని సూచించారు. కాల్వలో వెంటనే తూడును తొలగించాలన్నారు. గత రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, మరో రెండు రోజులపాటు వర్షం కొనసాగే అవకాశం ఉందని అన్నారు. పంటల సాగుకు సిద్ధమైన రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో పెరిగినందున దిగువ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

రియల్ దందా !

❁ల్యాండ్ కన్వర్షన్ చేయకముందే లే అవుట్లు
❁జిపి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు, అమౌంట్ వసూళ్లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మచిలీపట్నంలో పోర్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని, వచ్చే నాలుగేళ్లలో బందరులో బిపిసిఎల్ కంపెనీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రియల్ వ్యాపారుల కన్ను ఈ ప్రాంతంపై పడింది. ఈ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా లే అవుట్లు ఏర్పాటవుతున్నాయి. కొన్ని వ్యాపార సంస్థలు ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కనపెడుతున్నాయి. అనుమతులు తీసుకోకుండానే లే అవుట్లు ఏర్పాటు చేసి టోకెన్ అడ్వాన్సులు వసూళ్లు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడ) అధికారులు మాత్రం మిన్నకుండిపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

రియల్ మోసాల నుంచి ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోకుండా ప్రభుత్వాలు కొన్ని మార్గదర్శకాలు రూపొందించాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థల నుంచి లే అవుట్ నంబర్ (ఎల్‌పి నంబర్) పొందిన తర్వాతే రియల్ సంస్థలు లే అవుట్ ఏర్పాటు చేయడంతోపాటు ప్లాట్లను విక్రయించాలి. ముడ పరిధిలో దీనికి విరుద్ధంగా అత్యధిక రియల్ సంస్థలు లే అవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించేస్తున్నాయి. ముడ నుంచి ఎల్‌పి నంబర్ రాకముందే మచిలీపట్నం సుల్తానగర్ సుమా కన్వెన్షన్ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ 21 ఎకరాల్లో లే అవుట్ ఏర్పాటు చేసింది. ప్రీమియం బ్లాకు ప్లాటు గజం రూ.13,999, జనరల్ బ్లాకుకు రూ.12,999 చొప్పున ధర నిర్ణయించింది. నార్త్ ఈస్టు కార్నర్ ప్లాటుకు రూ.1000, ఈస్టు ఫేసింగ్ ప్లాటుకు రూ.500 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించింది. 267 ప్లాట్లకుగాను ఒక్కో ప్లాటుకు టోకెన్ అమౌంట్ (ప్లాట్ల బుకింగ్‌కు ముందస్తు నగదు) రూ.2 లక్షల చొప్పున రూ.5.34 కోట్లు వసూలు చేసింది. ఈ ఒక్క సంస్థ మాత్రమే కాదు.. ఇటీవల కాలంలో బందరు మండలం పోతేపల్లిలో ఇదే తరహాలో పదుల సంఖ్యలో లే అవుట్లు ఏర్పాటు చేశారు. పెడన, గూడూరు మండలాల్లోనూ అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్లాట్ల (మిగతా 2లో)



విఎంసి నూతన కమిషనర్‌గా ధ్యానచంద్ర



ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్‌గా ధ్యానచంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా ఉన్న ఆయనను బదిలీ చేసింది. 2019-20 ప్రాంతంలో ఆయన విజయవాడ సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం శాప్ డైరెక్టర్‌గా పని చేసి అక్కడి నుండి తిరుపతి జెసిగా బదిలీ అయ్యారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈనెల 3వ తేదీన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్చార్జి కమిషనర్‌గా విఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ వ్యవహరిస్తున్నారు.

నేడు వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైతాళికుల చిత్ర పటాల ఆవిష్కరణ జరగనుంది. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రం (ఎంబివికె) వారు వైతాళికుల చిత్రపటాలను రూపొందించారు. వీటిని ప్రముఖ చిత్రకారులు గిరిధర్ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో చిత్రించారు. మొత్తం 32 మంది పురోగమన సంస్కృతీ వైతాళికుల చిత్రపటాలను బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో శాశ్వత ప్రతిపాదికన అమర్చి ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో సామాజిక, సాహిత్య విశ్లేషకులు తెలకపల్లి రవి, కథా నవలా రచయిత డా.కెఎన్ మల్లీశ్వరి, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు (క్రియ), బాలాంత్రపు ప్రసూన, అనిల్ డ్యానీ, సత్యాజీ, ఎస్ అనిల్ పాల్గొంటారు.

ఎంపి శివనాథ్‌ను కలిసిన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు

ప్రజాశక్తి - విజయవాడ : నాగపూర్–విజయవాడ 163(జి) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములిచ్చిన తమకు నష్టపరిహారం ఇప్పించాలని శనివారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కు బాధిత రైతులు విన్నవించారు. ఖమ్మం నుంచి విజయవాడ వరకు నిర్మించే ఈ ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో భూములిచ్చిన మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన రైతులు... నగరంలోని గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపి శివనాథ్‌ను కలిశారు. భూములిచ్చి నష్టపరిహారం కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నామో వివరించారు. గ్రామంలో 170 మంది హైవే నిర్మాణం కోసం భూములివ్వగా వారిలో 60 మందికి మాత్రమే నష్ట పరిహారం అందిందని తెలిపారు. మిగిలిన 110 మందిలో 20 మందికి మాత్రమే అవార్డ్ కాపీ వచ్చిందని, మిగిలిన 90 మందికి అవార్డ్ కాపీ కూడా రాలేదని తెలిపారు. వీరిలో కొంతమంది భూముల్లో రాళ్ళ పాతారని, అయితే వారి పేర్లు గెజిట్ లో నమోదు కాలేదని వివరించారు. ఈ విషయంపై ఎంపి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి అందరికీ నష్టపరిహారం అందిచేలా చూస్తానని హామీ ఇచ్చారు.



అనంతరం కవులూరు రైతులు ఎంపి కేశినేని శివనాథ్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, భోగినేని రవీంద్రరావు, రైతు సంఘం నాయకుడు చెరుకూరి వేణుగోపాల్, భోగినేని సూర్య ప్రకాష్, బుడ్డి మల్లేశ్వరరావు, చెరుకూరి సుబ్బారావు, బొర్రా అశోక్ పాల్గొన్నారు.



నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత

కెయు ఇన్చార్జి విసి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కషి చేస్తానని కృష్ణా విశ్వవిద్యాలయ ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఇన్చార్జి ఉపకులపతిగా విశ్వవిద్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి ఖర్చుచేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం సాకారం చేయడానికి తన వంతు కషి చేస్తానని చెప్పారు. విద్యకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అలాగే ఎటువంటి ఆటంకం లేకుండా రోజువారీ తరగతులు నిర్విరామంగా జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వం తన ముందు ఉంచిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు. ప్రకాశం జిల్లాలో జన్మించిన తాను ఒంగోలు, చీరాల, తిరుపతి, హైదారాబాద్‌లలో విద్యాభ్యాసం పూర్తి చేసినట్లు తెలిపారు. కాకినాడ జెఎన్‌టియులో ఇరవై ఆరేళ్లుగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డును పొందానని, ఈఈఈ విభాగంలో ఆచార్యునిగా భాధ్యతలు నిర్వహించానని తెలిపారు. తొలుత నూతన ఉపకులపతికి రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు, ఆచార్యులు, సహాయ ఆచార్యులు స్వాగతం పలికారు. పలు విభాగాల సిబ్బంది కూడా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

యుటిఎఫ్ నేత వెంకటేశ్వరరావు సతీమణి మృతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, కష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన దివంగత పి వెంకటేశ్వరరావు సతీమణి పి.కష్ణకుమారి శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతికి యుటిఎఫ్ కష్ణా జిల్లా శాఖ సంతాపం తెలిపింది. ఆమె అంతిమయాత్ర ఆదివారం ఉదయం పెనమలూరులోని ఆమె స్వగ్రహం నుండి ప్రారంభమవుతాయి.





అంబేద్కర్ స్మృతివనం సందర్శకులకు మరిన్ని ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని 125 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి పర్యటన మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు జరిగాయని, ఇదేవిధంగా మరిన్ని సౌకర్యాలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. జి.సజన అధికారులకు సూచించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతివనాన్ని కలెక్టర్ సృజన సందర్శించారు. అనంతరం ప్రాంగణంలోని విహార మినీ థియేటర్‌లో కలెక్టర్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. హరిత ప్రాంతం, ఫౌంటెయిన్లు, ఆర్‌వో ప్లాంట్ నిర్వహణబీ వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, భద్రత తదితర అంశాలపై చర్చించారు. విఎంసి ఇన్‌ఛార్జ్ కమిషనర్ డా. ఎ.మహేశ్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టులు) కేవీ సత్యవతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు పాల్గొన్నారు.

గోదాముల నిర్మాణ భారం సొసైటీపైనా..!

నున్న పిఎసిఎస్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన

విజయవాడ రూరల్: గత ప్రభుత్వం ఇష్టానుసారంగా తమ సొంత మనుష్యులకు కాంట్రాక్ట్‌లను కట్టబెట్టే క్రమంలో భాగంగా గోదాముల నిర్మాణ భారాన్ని సొసైటీలపై మోపడంపై విజయవాడ రూరల్ మండలం నున్న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గొప్ప కోసం గత ప్రభుత్వం రూ.80 లక్షలతో రెండు గోదాములను మంజూరు చేసి, ఆ భారాన్ని నున్న సొసైటీపై మోపడంపై సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇద్దరు కాంట్రాక్టర్లు ఆదిలోనే పనులను ఆపేసి వెళ్లిపోయారని, ఇప్పటికే సొసైటీ రూ.25 లక్షలు ఖర్చు చేసిందని పలువురు సభ్యులు తెలిపారు. నున్నలో రూ.80 లక్షల వ్యయంతో రెండు గోదాముల నిర్మాణాలను చేపట్టగా, ఆ పనులు ఏడాదిగా నిలిచిపోయాయన్నారు.

మేజర్ అవుట్ ఫాల్ డ్రైన్ పూడికలు తీయండి

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ శనివారం బెంజ్ సర్కిల్ నేషనల్ హైవే, గురునానక్ కాలనీ రోడ్, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్, కొమరయ్య స్ట్రీట్, ఓల్డ్ రాజరాజేశ్వరి పేట, నిజాం గేట్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ముందుగా బెంజ్ సర్కిల్ దగ్గర ఉన్న వర్షపు నీటి నిలువలను చూసి ఎయిర్టెక్ మిషన్లతో వెంటనే నీటి నిల్వలను క్లియర్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

మొదటిపేజీ తరువాయి

కొండ ప్రాంత ప్రజల రక్షణ, అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

సిటీ కార్యదర్శి, కార్పొరేటర్ బోయి సత్యబాబు తదితర నేతలు పర్యటించారు. వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో బిక్కుబిక్కుమంటున్న జీవనం సాగిస్తున్న ప్రజలను పరామర్శించారు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలుసుకొని వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు ప్రాంతంలో గత రెండుమూడేళ్లలో రక్షణ గోడలు కూలిన ప్రాంతాలను పరిశీలించారు. 51వ డివిజన్ కొత్తపేట కొండ ప్రాంతంలో శుక్రవారం విరిగిపడిన కొండ చరియలు, దెబ్బతిన్న ఇళ్లను చూశారు. నష్టపోయిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు, సత్యబాబు మాట్లాడుతూ నగరంలో 16 డివిజన్లలో రెండు లక్షల మంది ప్రజలు కొండ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వీటిలో 12 డివిజన్లు పశ్చిమ నియోజకవర్గంలోనే ఉన్నాయని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం, విజయవాడ నగరపాలక సంస్థ పాలకపక్షం కొండ ప్రాంతవాసులను నిర్లక్ష్యం చేశాయన్నారు. టిడిపి కూటమి కొండ ప్రాంతవాసులను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో నగరంలోనూ, పాతబస్తీలోనూ కొండప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల రక్షణకు, రక్షణ గోడల నిర్మాణానికి, అభివద్ధి కార్యక్రమాలకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణ ప్రమాదాల నివారణకు మున్సిపల్, రెవెన్యూ, ఫైర్ తదితర శాఖల సిబ్బందితో ప్రత్యేక బందాలు ఏర్పాటు చేయాలని కోరారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్ నిర్మించాలని, బాధితులకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. అసెంబ్లీలో కొండ ప్రాంత ప్రజల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం నేతలు సూరిబాబు, ఇవి నారాయణ , రాజు, నాగా, బాషా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రియల్ దందా !

విక్రయాలను ప్రారంభించాయి.

మోసాలకు ఆస్కారం ఇలా

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థల అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు పలు సందర్భాల్లో నష్టపోతున్నారు. రియల్ సంస్థలు ముందుగా చెప్పిన విధంగా లే అవుట్లో మౌలిక వసతుల కల్పించడం లేదు. భూ యజమానుల నుంచి నగదు చెల్లించి రియల్ సంస్థలు భూములను కొనుగోలు చేయడం లేదు. ల్యాండ్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు చేసుకునే క్రమంలో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపి) అగ్రిమెంట్ మాత్రమే చేసుకుంటునున్నాయి. దీని ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేస్తున్నాయి. భూ యజమాని కుటుంబ సభ్యుల మధ్య భాగస్వామ్య ఒప్పందాల్లో తేడాలు చోటుచేసుకుంటే వివాదాలు కోర్టు కెక్కుతున్నాయి. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నష్టపోతారు. టోకెన్ అమౌంట్లను వసూలు చేసిన సంస్థలు బోర్డు తిప్పేసే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఓ సంస్థ ఇలానే బోర్డు తిప్పేయడంతో వందలాది మంది కోట్లాది రూపాయలు నష్టపోయారు. ఈ క్రమంలోనే ప్లాట్లు కొనుగోలు చేసేవారు నష్టపోకుండా అక్రమ లే అవుట్ల నివారణకు ముడ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నైపుణ్యంతో ఉద్యోగాల్లో రాణించాలి

- జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు
- జాబ్‌మేళాలో పది మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని పట్టాభి మెమోరియల్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో స్కిల్ డెవలప్మెంట్ సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాది కల్పన అధికారి డి విక్టర్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ ప్రయత్నాల్లో అవకాశం రాలేదు అని నిరుత్సాహపడకుండా తమలోని నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. యువతలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి ఉద్యోగ మేళాలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో అనేక సంస్థల్లో ఉద్యోగాలు ఉన్నప్పటికీ దానికి అవసరమైన నైపుణ్యం లేకపోవడం వలనే ఎంపిక కాలేకపోతున్నారు. కావున ప్రస్తుతం ప్రభుత్వం విద్య తోపాటు నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి విద్యార్థులకు నైపుణ్యాలను మెరుగు పరిచే దిశగా కషిచేస్తుంది అని ఆయన తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తున్న శిక్షణ శిబిరాలను మరియు ఉద్యోగ మేళా లను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా ఈ జాబ్ మేళాలో 95 మంది హాజరు కాగా వారిలో 10 ఎంపిక



అయ్యారని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పట్టాభి సీతారామయ్య ట్రస్ట్ డైరెక్టర్ గోపీనాథ్, యంగ్ ప్రొబేషన్ ఎస్.జయరాజు చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జి.వెంకటేశ్వరరావు వివిధ సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డ్రెయిన్లలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు గ్రామంలో శనివారం ఇరిగేషన్, డ్రైనేజీలు అధికారులు మురళి, కిరణ్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రచ్చబండ డ్రెయిన్ లో పూడికతీత తీయించాలని రైతులు కోరగా ప్రొక్లెయిన్ ఏర్పాటు చేసి డ్రెయిన్ లో పేరుకుపోయిన చెత్తా, చేదారాలను తొలగించారు. అలాగే గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడూరు ఇందిరమ్మ కాలనీలో రోడ్లన్నీ జలమయ్యమవడంతో గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, పంచాయతీ కార్యదర్శి భాస్కంరావు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మురుగు డ్రైన్ ను పొక్లెన్ తో తవ్వించి సమస్యను పరిష్కరించడం జరిగింది. విష జ్వరాలు వ్యాపిస్తున్నందున ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతన రామోజీ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్ ఏ బేగ్, వార్డు సభ్యులు లింగం విజయ్ కుమార్, డొక్కు నాగరాజు, లుక్కా మహేష్, పోతన పాల్గొన్నారు.

హెల్మెట్ ఉపయోగంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి శ్రీహరి అన్నారు. హెల్మెట్ ధరించడం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్ట్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి శ్రీహరి అసోసియేషన్ అధ్యక్షులు కాగిత గోపీచంద్ ఉపాధ్యక్షులు పల్లె అశోక్ తో పాటు ఉయ్యూరు టౌన్ ఎస్ఐ గణేష్ రూరల్ ఎస్సై అవినాష్‌తో పాటు తోట్లవల్లూరు పమిడిముక్కల సబ్ ఇన్స్పెక్టర్లు లాయర్లు పాల్గొన్నారు. ఉయ్యూరు కోర్ట్ ప్రాంగణం నుండి సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని నినదించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన న్యాయమూర్తి శ్రీహరి హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోకుండా ఉండవచ్చునని, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ వాడకాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** వాహనాలు నడిపే వాళ్ళు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుడివాడ రూరల్ సిఐ కె.ఏసుబాబు కోరారు. మండల



ఉయ్యూరులో...


కేంద్రమైన గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్లో వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై, ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ బైక్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అన్నారు. కారు నడిపే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించి ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి సత్యనారాయణ, ఏఎస్ఐ సారధి బాబు, మెండు సాంబశివరావు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి- కోడూరు : ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని లెజెండ్స్ సోషల్ సర్వీస్ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి అన్నారు. శనివారం కోడూరు రామకష్ణ థియేటర్ ప్రాంగణంలో (మసీద్ సెంటర్) మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోడూరు ఫర్టిలైజర్స్ అండ్ ఫస్ట్ సైడ్స్ సంఘ అధ్యక్షులు పూతబోయిన వెంకట రామారావు ప్రారంభించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తనమోనాలను సేకరించారు. 86 మంది రక్తదానం చేశారని లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ అధినేత పూత బోయిన అయ్యప్ప స్వామి తెలియజేశారు. అన్నం యోగానంద్, మేడూరి చంద్రశేఖర్, బండే జయ కిషోర్, లెజెండ్స్ సోషల్ సర్వీస్ టీం సభ్యులు, పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలని వినతి

ప్రజాశక్తి-కంకిపాడు : భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్డులు వచ్చిన ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు రైతుల ఎకౌంట్లో వేయాలని కౌలు రైతుల సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు కోరారు. రైతుసంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కంకిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తూ రైతు పండించిన పంటకు సి ప్లస్ 2 ప్రకారం గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ బోర్ లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనిని సంవత్సరానికి 200 రోజులు కల్పించి, రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఉమ్మడి కార్యాచరణ ద్వారా ఉద్యమాలను నిర్మిస్తామని అన్నారు. అనంతరం కంకిపాడు, బొడ్డపాడు, గొడవర్రు, తేన్నేరు మొదలగు గ్రామాలలో గ్రామ సచివాలయ అధికారులకు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కంకిపాడు మండల కార్యదర్శి వి శివశంకరు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జే రవి, వి మరియదాసు, టి నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏ తిరపతయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** కత్తివెన్ను మండలంలో నీలిపూడి గ్రామ సచివాలయం, ఎండపల్లి గ్రామ సచివాలయంలోనూ, చిన్న పాండాక గ్రామ సచివాలయంలోనూ ఆయా గ్రామాల కార్యదర్శులకు రైతు సంఘం నాయకులు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా రైతు సంఘం నాయకులు లంకదాసుల అజయ్ ఘోష్ , సి.ఐ.టి.యు నాయకులు మాజేటిశివ శ్రీనివాసరావు, సీనియర్ రైతు నాయకులు పుప్పాల నరసింహారావు , పాశం పాండురంగ విఠల్, పుప్పాల సుజాత ,బాడిత శివ నాగబాబు, పి .నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** బొడ్డపాడు గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్ ఆధ్వర్యంలో శనివారం సచివాలయ కార్యదర్శి అంజనాదేవికి వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో గ్రామంలోని పలువురు సిపిఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కౌలు రైతులు ఉన్నారు.



కంకిపాడులో...



బంటుమిల్లిలో..



తోట్లవల్లూరులో...

దాడి కేసులో మరో ఇద్దరు అరెస్టు : సిఐ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి చేసిన కేసులు మరో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశామని సీఐ కె వి ఎస్ వి ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గన్నవరం డిఎస్పీ జయ సూర్య ఆధ్వర్యంలో ఈ కేసులో ముద్దాయిలుగా గుర్తించబడిన వారిలోని 15 మందిని 9వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపామన్నారు. తదుపరి దర్యాప్తులో భాగంగా తమకు వచ్చిన సమాచారం మేరకు. 18వ తేదీన బొమ్మారెడ్డి వెంకట నరసింహారెడ్డి, కారుమంచి మహేష్ లను అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరుపరచగా వారికీ 14 రోజుల రిమాండ్ విధించి గన్నవరం జైలుకు పంపామన్నారు. పరారీలో ఉన్న మిగిలిన ముద్దాయిల కొరకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ శాఖ అధికారి సస్పెన్షన్

ప్రజాశక్తి-పెడన : పెడన మండల వ్యవసాయ అధికారి జేవి శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. గతేడా డిసెంబర్లో కురిసిన మించింగ్ తుఫాను కారణంగా రైతుల పంట నష్టపరిహార అందించడంలో బినామీ పేర్లతో అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయంపై సదరు రైతులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లో జూన్ మొదటి వారంలో ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై విచారించారు. తదుపరి జూన్ రెండవ వారంలో బల్లిపర్రు, పెడన అర్బన్ గ్రామ వ్యవసాయ సహాయకులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అప్పటినుంచి శుక్రవారం వరకు జరిగిన విచారణలో ఏవో శ్రీనివాసరావు, తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్ పథకం ప్రకారమే నకిలీ అకౌంట్లు అలాగే వ్యవసాయ భూములు లేని వారికి పట్ట నష్టపరిహారం వారి అకౌంట్లో జమ అయ్యేలా జిమ్మిక్కులు చేశారని ఉన్నతాధికారులు విచారణలో తేలింది. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ముంపుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంపు బారిన పడిన ప్రజలను, పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వర్షాల వల్ల గన్నవరం నియోజకవర్గంలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నా యన్నారు. కూరగాయ తోటలకు విపరీతంగా నష్టం జరిగిందని చెప్పారు. లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురై జనాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏలూరు కాలువలో ఉన్న తూడు వెంటనే తొలగించాలన్నారు. ఎంత వర్షం వచ్చినా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మురుగు కాల్వలు తక్షణమే శుభ్రం చేయాలని. బ్లీచింగ్ చల్లి వ్యాధుల వ్యాప్తి జరగకుండా చూడాలన్నారు. అలాగే తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ చేయాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా ఇంటింటికి వెళ్లి మందులు పంపిణీ చేయాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి చల్లపల్లి : చల్లపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోమల నగర్‌లోని నర్రా రమాదేవి సాయిబాబు లయన్స్ మల్టీపర్పస్ సొసైటీ భవనంలో కొల్లిపర మధు సతీమణి పార్వతి జ్ఞాపకార్థం మధు సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో నేత్ర వైద్యుల వెంకట్రావు నలభై మందికి కంటి పరీక్షలు నిర్వహించి పదకొండు మందిని ఆపరేషన్ నిమిత్తం గుర్తించి గూడూరు లోని సాయి నేత్రనేత్రాలయంనకు పంపించారు. ఈ కార్యక్రమంలో రాయపాటి రాధాకష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, నర్రా సాయిబాబు, కొల్లిపర నాగ పోతరాజు , మెపిదేవి వెంకటేశ్వర రావు , ముమ్మారెడ్డి వెంకట కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : టిడిపి జాతీయ కార్యాలయంలో గాజువాక ఎంఎల్‌ఎ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుని టిడిపి మైనార్టీ నాయకులు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. తాజా రాజకీయ పరిణామలపై చర్చించారు.

శ్రీశైలం నుండి సారె

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానం నందు అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం, శ్రీశైలం నుండి ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు దంపతులు, అర్చకులు, అధికారులు కనకదుర్గ అమ్మవారికి ఆషాడ పవిత్ర సారె సమర్పించారు. వీరికి దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యముల నడుమ స్వాగతం పలికారు. అనంతరం వీరు అమ్మవారిని దర్శనం చేసుకుని అమ్మవారికి పవిత్ర సారె సమర్పించారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వహణాధికారి కె.ఎస్ రామారావు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రము, చిత్రపటం అందజేవారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం వారు శ్రీ దుర్గ గుడి కార్యనిర్వాహణ అధికారికి, సిబ్బందికి శ్రీశైలం దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఎన్‌టిటిపిఎస్ సాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఐదో దశలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయాల పాలై ఆంధ్ర హాస్పటల్‌లో చికిత్స పొంద ుతున్న వి.అప్పారావు, చక్రధర్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు ఖర్చుల నిమిత్తం చెక్కు రూపంలో చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు ఇతర అధికారులు, తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షులు పర్వతనేని సాంబశివరావు, రీజినల్ అధ్యక్షులు ఆలపాటి శివ నాగేశ్వరావు, పల్లా సత్యనారాయణ, తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి మందడపు దుర్గారావు, తెలుగు నాడు కాంటాక్ట్ కార్మిక సంఘం ప్రచార కార్యదర్శి జొన్నలగడ్డ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న అధికారులు

వ్యాపారులతో మున్సిపల్ కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని చికెన్, మటన్, చేపల వ్యాపారులతో కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు, ధృవీకరించబడిన వస్తువులు మాత్రమే అమ్మాలని తెలిపారు. వాణిజ్యం కోసం లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. వీధి కుక్కలు పెరిగే విధంగా బహిరంగ ప్రదేశాల్లో విక్రయాలు జరపవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పడవేయద్దని తెలిపారు. వ్యర్థాలను సరిగ్గా పారవేయడం, దోమలు లేకుండా చేయడం కోసం మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్నకమిషనర్ శంకర్

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ



మాట్లాడుతున్న డి.వి.కృష్ణ

ప్రజాశక్తి - ఎ.కొండూరు : రైతులు ఐక్యంగా పోరాడుతూనే తమ సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతారని రైతులకు అండగా సిపిఎం వెన్నంటి ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ అన్నారు. శనివారం ఎ.కొండూరులోని సుందరయ్య భవన్‌లో మండల రైతు సంఘం కార్యదర్శి ఆళ్ళ అమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల, కౌలు రైతుల సమస్యలపై సిపిఎం అనేక రకాల పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎ.కొండూరు మండలానికి చెందిన కొండూరు, పాత కొండూరు, కొండూరు తండా గ్రామాలకు చెందిన రైతులు 2021 సంవత్సరంలో వారు పండించిన ధాన్యాన్ని ఎ.కొండూరు మార్కెట్ యార్డ్ ద్వారా అమ్మకం జరిగినట్లు తెలిపారు. ఆ ధాన్యానికి సంబంధించి 13 మంది రైతులకు, రావలసిన రూ.10.87 లక్షలు పెండింగ్‌లో పడి సంవత్సరాలు గడుస్తున్నా రైతులకు సొమ్ములు రాలేదన్నారు. సిపిఎం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు పలుమార్లు ధర్నాలు, పోరాటాలు నిర్వహించారన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా రైతులకు రావలసిన ధాన్యం డబ్బులు మొత్తం రూ.10.87 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. గతంలో ఎ.కొండూరులో నకిలీ మిర్చి విత్తనాలు, గంపలగూడెం మండలం పెనుగొలనులో కల్తీ మిర్చి నారు వల్ల నష్టపోయిన రైతాంగానికి 18 నెలలు ఆందోళనలు, పోరాటాలు నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఇప్పించినట్లు గుర్తు చేశారు. మండలంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ప్రజలను కాపాడటానికి సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించి వారికి ప్రభుత్వం నుండి పెన్షన్ మంజూరు అయ్యేలా, తాగునీటి సరఫరా అయ్యేలా చేసినట్లు తెలిపారు. తిరువూరు, ఎ.కొండూరు ప్రభుత్వాసుపత్రులలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటుకు సిపిఎం రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పానెం ఆనందరావు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎస్. రామకష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు రావుల రామకష్ణ, రైతులు పి.బద్దు, కేవళ, శ్రీను, వెంకటేశ్వరరావు, ఎస్. కొండలరావు పాల్గొన్నారు.

విరాజ్ రాయల్ పోల్కీ జ్యుయలరీ షో ఆవిష్కరణ



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాల రిటైలర్ మలబార్ గోల్డ్ డైమండ్స్, తమ విజయవాడ షోరూములో జూలై 20 నుండి జూలై 28 వరకు 'విరాజ్ రాయల్ పోల్కీ జువెలరీ షోను డాక్టర్ శ్వేత,మధు,బి.సంధ్య ,మలబార్ వినియోగదారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా మలబార్ షోరూంను సందర్శించి నగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మలబార్ షోరూం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఖాసిం మాట్లాడుతూ మనాణ్యమైన నగలు ఇక్కడ లభిస్తున్నట్లు తెలిపారు. రాయల్ డిజైన్లతో కూడిన ఈ అసాధారణ ప్రదర్శనలో స్టోన్ విలువలో 25శాతం వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. రాజసం ఉట్టిపడే సున్నితమైన ఆభరణాలను కొనుగోలు చేయడానికి ఈ షో ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. అలనాటి మహారాణిలు ధరించిన, కాలాలకు అతీతంగా నిలిచిపోయే ఆభరణాల నుండి ప్రేరణ పొంది, శతాబ్దాల నాటి సంప్రదా యాలను సమకాలీన ఆభరణాల డిజైన్లతో సమ్మిళితం చేసినట్లు తెలిపారు.ఐ.జిఐ ధృవీకరించిన ఈ పోల్కీ ఆభరణాలు, 11 మలబార్ వాగ్దానాల హామీతో లభిస్తున్నాయన్నారు. రాళ్ల బరువు,నికర బరువు ఆభరణాల రాళ్ళ విలువను సూచించే పారదర్శక ధరల పట్టిక, ఆభరణాలకు జీవితకాల నిర్వహణ, పాత నగలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారంపై 100 శాతం విలువ, హెచ్యూఐడి ధృవీకరణతో బంగారం, గ్లోబల్ స్టాండర్డ్స్ నాణ్యత తనిఖీని నిర్ధారించే 28-పాయింట్ల చెక్, ఐ.జి.ఐ, జి.ఐ.ఎ ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంట్, ఆభరణాలకు ఉచిత బీమా అందిస్తుని తెలిపారు.

వాహన పోర్టల్ అమలు తీరుపై లారీ ఓనర్ల అసంతృప్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రవాణాశాఖ ఆన్ లైన్ సేవలను ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వ పోర్టల్ ఈ-ప్రగతితో పాటు కేంద్రప్రభుత్వ వెబ్ సైటు వాహన్ ద్వారా అందిస్తూ వచ్చిన అధికారులు ఇకపై ఈ-ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ ను విస్తరించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో చేపట్టిన డేటా బదలాయింపు ప్రక్రియ వల్ల వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా అన్నారు. శనివారం ఉదయం విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ పలు సేవల వివరాలు వాహన్ పోర్టల్‌లో కనిపించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి.ఈశ్వరరావు మాట్లాడుతూ 2016లో ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయని, కేంద్రప్రభుత్వం ఎన్.ఐ.సీ.(నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) ద్వారా రూపొందించిన వాహన్ పోర్టల్ లో ఏపీ రవాణాశాఖ 2021లో చేరిందని, వాహన్ వెబ్‌సైట్ నెమ్మదిగా ఉండటం, ఈ-ప్రగతిలో ఉండే అనేక మాడ్యూల్స్ అందులో లేకపోవడంతో వాహనాల డేటా ట్రాన్స్ ఫర్ ప్రక్రియ జాప్యమవుతోందన్నారు. గత పదిహేను రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలోని లారీలకు సంబంధించిన ట్రాన్స్‌ఫర్, రెన్యువల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీల జారీ, త్రైమాసిక పన్నులు, ఈ-చలాన్ల చెల్లింపు, ఈ-పర్మిట్ల జారీ తదితర సేవలు నిలిచిపోయి వాహనదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ జులై 8 నుండి ప్రయోగాత్మకంగా వాహనాల డేటాను ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ వెబ్ సైట్ 'ఈ-ప్రగతి' నుంచి వాహన్ పోర్టల్ (ఎన్.ఐ.సీ. సర్వర్) లోకి బదిలీ చేయడానికి ఎన్టీఆర్ జిల్లాను కాకుండా తక్కువ వాహనాలు ఉండే జిల్లాను ఎంపిక చేసి ఉండాల్సిందన్నారు.



మాట్లాడుతున్న రాజా

స్మార్ట్ విజన్‌లో ఆధునిక లేజర్ మిషన్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నేత్ర సంరక్షణా రంగంలో అగ్రగామిగా నిలిచిన స్మార్ట్ విజన్ సరికొత్త లేజర్ మిషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా విజయవాడలో ప్రారంభించినట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.స్వాతిమణి తెలిపారు. ఈ సందర్భంగా సూర్యారావు పేటలోని, కోవెలమూడివారి వీధిలో ఉన్న స్మార్ట్ విజన్ ఐ లేజర్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.స్వాతిమణి మాట్లాడుతూ ఈ నూతన 'స్మైల్ ప్రో' మిషన్‌న్ను భారతదేశంలో 5వ మిషన్‌గా విజయవాడ స్మార్ట్ విజన్‌లో ప్రారంభించడం గర్వకారణంగా ఉందన్నారు. కేవలం 8 సెకన్లలోనే కంటి చికిత్సలను 'స్మైల్ ప్రో' అనే నూతన లేజర్ మిషన్‌తో చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని 18-40 సంవత్సరాల వయస్సుల వారికి, కళ్ళజోడు లేకుండా చిన్న అక్షరాలను సైతం చదవగలుగుతారన్నారు. ఐటి, స్పోర్ట్స్ రంగాల్లో ఉన్న వారికి ఈ లేజర్ చిక్సిత ఎంతగానో ఉపయోగమని, మైనస్ పవర్ సరిచేయడానికి, ఖచ్చిమైన ఫలితాలకు ఈ 'స్మైల్ ప్రో' మిషన్ ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు.



లేజర్ ట్రీట్‌మెంట్ చేస్తున్న దృశ్యం - పక్కన మాట్లాడుతున్న డాక్టర్ స్వాతిమణి

నిమ్రా మెడికల్ కళాశాల అధ్యాపకుడికి పిహెచ్‌డి



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నిమ్రా మెడికల్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న షేక్ జాన్ బాషాకు తమిళనాడుకు చెందిన సవిత యూనివర్శిటీ పిహెచ్‌డి డిగ్రీ సోమవారం ప్రదానం చేసింది. 'ఎవల్యూషన్ ఆఫ్ ప్లాస్మా నైట్రోథైరోసిన్, ఎపిలిన్ యాజ్ నావెల్ బయో మార్కర్స్ ఆఫ్ ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఇన్ టైప్ - 2 డయాబెటిస్ మిల్లిటస్ పేషంట్స్' అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని డాక్టర్ డి.షీలా పర్యవేక్షణలో సవిత యూనివర్సిటీలో సమర్పించినందుకు బయో కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిమ్రా విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణ మూర్తి, మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ కృష్ణమూర్తి, అకాడమిక్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ బాబులాల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరాం, డాక్టర్ షబానా, డాక్టర్ శాంతి, సిబ్బంది విద్యార్థులు భాషను అభినందించారు.

సరికొత్త టెక్నాలజీతో సోనీ బ్రావియా హోమ్ థియేటర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న సోనీ సరికొత్తగా బ్రావియా థియేటర్ సౌంబ్ బార్‌లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సోనీ షోరూమ్ మేనేజర్ కె.ఎస్.ప్రసాదరావు తెలిపారు. నగరంలోని సోనీ షోరూమ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. హోమ్ థియేటర్ బార్ 8, బార్ 9 పేరుతో రెండు మోడళ్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఇవి ఆడియో, దృశ్య సాంకేతికతలతో సోనీ నైపుణ్యాన్ని మిళితం చేసి ఇంట్లో సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయని తెలిపారు. పెద్ద స్క్రీన్‌లోని మ్యాజిక్‌ను సౌకర్యవంతంగా అందిస్తాయని తెలిపారు.

గాడితప్పిన శాంతి భద్రతలు : వైసిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని వైసిపి నాయకులు పోతిన వెంకట మహేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినుకొండలో టిడిపి కూటమి నాయకుల చేతిలో దారుణంగా హత్య చేయబడ్డ రషీద్ కుటుంబాన్ని మాజీ సిఎం జగన్ పరామర్శించడానికి వెళ్తే కూటమి నాయకులు అత్యంత దారుణంగా విషం చిమ్ముతున్నా రన్నారు. జగన్‌కు వచ్చిన ప్రజా స్పందన చూసి ఓర్వలేకే కూటమి నాయకులు ఇష్టాను సారం విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని అన్నారు. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు జరుగుతూ ఉంటే అందరూ కళ్ళు మూసుకుని నోటికి ప్లాస్టర్లు వేసుకొని మౌనంగా ఉండాలా? అని ప్రశ్నించారు.

ఆయిల్ ఫామ్ సాగుకు రాయితీ : కలెక్టర్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆయిల్ ఫాం సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ వ్యవసాయ సహాయ సిబ్బందికి ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా పంటకు ప్రకతి విపత్తుల నుంచి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. అదేవిధంగా సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చే రైతులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ సాగుకు నూటికి నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేపట్టే రైతులకు 100 శాతం రాయితీపై హెక్టార్కు రూ ఇరవై తొమ్మిది వేల విలువచేసే 143 మొక్కలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఇతర పంటలు హెక్టార్కు సంవత్సరానికి 5250 చొప్పున నాలుగేళ్లలో 21,000 రాయితీ లభిస్తుందన్నారు. చాప్ కట్టర్ వర్మి కంపోస్ట్ యూనిట్లు వైర్ మెష్ పై 50 శాతం రాయితీ లభిస్తుంది అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిపై 50 శాతం ప్రభుత్వ రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెరిగేందుకు కషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఘంటసాల కషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు డాక్టర్ ఏ మంజువాణి పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని జే జ్యోతి, ఏపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ జి విజయలక్ష్మి, అవనిగడ్డ ఉద్యానవన శాఖ అధికారి ఎస్ రమేష్ పాల్గొన్నారు.



ఆయిల్ ఫాం సాగు పై రైతులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ



కొల్లాటి అశోకుని సత్కరిస్తున్న శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు

బాక్సింగ్ క్రీడాకారుడికి సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని అవనిగడ్డకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆయన కార్యాలయం వద్ద ప్రపంచ స్థాయిలో ము యే థాయ్ బాక్సింగ్ ప్రపంచ స్థాయి పోటీలలో తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న గుంటూరు జిల్లా నిజాం పట్నం గ్రామవాసి నాగాయలంక ఎదురుమండి గ్రామానికి చెందిన వారి మనవడు అయిన కొల్లాటి అశోక్ ప్రపంచ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించడంతో శనివారం శ్రీనివాస్ తన కార్యాలయం వద్ద సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులను తయారు చేసే ఒక శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తే అందుకు కావలసిన సహాయ సహకారాలు తాను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు కె పూర్ణచంద్రరావు, జి ఎన్.బి గోపాల్ గరికపాటి, మారుతి, వ్యాయామ సంఘం ట్రెజరర్ మునగాల ఉదయ్ కుమార్, బడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి-మొవ్వ : భారీ వర్షాలకు మొవ్వ మండలం అవురిపుడి, కాజ గ్రామాల్లోని పంటపొలాలు నీట మునిగాయి. అవురిపూడి గ్రామంలో సుమారు 100 ఎకరాలకు పైగా వరి నారు నీటి మునిగింది. మరో నాలుగు రోజులు నీట మునిగి ఉంటే నారు మడులు పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండలంలో చెదురుమదురుగా వరినట్లు వేసి ఉన్నారు. పల్లపు ప్రాంతాల్లో భూములు కూడా నీట మునిగి ఉన్నాయి. మండలంలో ప్రధానంగా మంత్రి పాలెం నుండి కాజ వెళ్లే మురుగు డ్రైనేజీలు సంవత్సరాల తరబడి గుర్రపు డెక్క నాచుతో మేట వేసి ఉన్నాయి. ఈ మురుగుపోయిన డ్రైనేజీ మేట వేసి ఉండటం వల్ల నీరు కదలకుండా నిల్వ ఉండటంతో భారీ వర్షాలతో రైతాంగానికి ఈ కష్టాలు తప్పడం లేదు. నూటికి 90 శాతం కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నష్టపోయిన నారుమళ్ళను అధికారులు పరిశీలించి ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతాంగానికి రైతు భరోసా కేంద్రం ద్వారా వరి విత్తనాలను ఉచితంగా గాని సబ్సిడీ ద్వారా గాని ఇవ్వాలని కోరారు. మండలంలో పేరుకుపోయిన గురపు డెక్క, కూటి కాడ ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించి ఆదుకోవాలని సంబంధిత అధికారులను రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాజ కౌలు రైతు నాయకులు కొడాలి కరుణాకర్ రావు, అవురిపుడి కౌలు రైతులు వేణుబాబు, శ్రీనివాసరావు, రాము తదితర రైతులు పాల్గొన్నారు.



నీట మునిగిన వరిపొలాలు

చేనేత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-పెడన : అప్పుల బాధ తాళలేక శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం శివానగర్ లోని శంకరాపురం కు చెందిన చేనేత కార్మికుడు నీరుగుట్ట నారాయణస్వామి (42) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, మతుని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర చేనేత విభాగం నాయకులు కట్ట హేమ సుందరం డిమాండ్ చేశారు. శుక్రవారం పట్నంలో హేమ సుందర్ రావు విలేకరులతో మాట్లాడారు. రేక్కడికి గాని డొక్కాడని చేనేత కుటుంబాల్లో అప్పుల బాధలు తట్టుకోలేక కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారని వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా చేనేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకోకుండా ప్రభుత్వం సరైన ప్రాణాలిక రూపొందించాలని హేమ సుందర్ రావు పేర్కొన్నారు.



వర్షాలకు స్లాబు కారిపోతున్న ప్రభుత్వాసుపత్రి భవనం

వర్షం పడితే నరకయాతనే...

- కారిపోతున్న గన్నవరం పిహెచ్‌సి స్లాబు
- ఆస్పత్రిలో మౌలిక వసతులు నిల్

ప్రజాశక్తి-గన్నవరం : చినుకు పడితే గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం కారిపోతుంది. స్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడతాయో తెలియని పరిస్థితి. మౌలిక వసతులు లేకపోవడంతో ఒక గదిలో ముగ్గురు డాక్టర్లు ఉండి రోగులను పరీక్షించాల్సి వస్తుంది. డెంటల్ డాక్టర్ ఉన్న సదుపాయాలు లేకపోవడంతో వైద్యం అందడం లేదు. డాక్టర్ను మూడు రోజులు వేరే పనులకు వినియోగిస్తున్నారు. దీంతో దంత వైద్యం ప్రశ్నార్ధకం అవుతుంది. ఓపి బ్లాక్, వైద్యులకు ఐదు గదులు, ఫార్మసీ బ్లాక్ కోసం ఒక భవనం కట్టాల్సి ఉంది. దీనికోసం నిధులు శాంక్షన్ చేయాలని ఐదేళ్లుగా అడుగుతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని రోగులు చెబుతున్నారు.

40 పడకల ఆసుపత్రి కావడంతో ఆర్థోపెడిక్, గుండె సంబంధిత స్పెషలిస్టులు ఉండడం లేదు. ఆదివారం ఏదైనా ఎమర్జెన్సీ కేసు వస్తే అప్పుడు డాక్టర్ కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి. ప్రతిరోజు రాత్రి వేళలో కూడా ఇదే పరిస్థితి. ఈ క్రమంలో సిబ్బంది డాక్టర్లుగా మారి ప్రాథమిక వైద్యం చేస్తున్నారు. సాధారణమైన రోజుల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకే డాక్టర్లు ఉంటారు. ఆ తర్వాత చూద్దామన్నా డాక్టర్లు కనిపించరు, రాత్రివేళ ఏదైనా కేసు వస్తే వెంటనే విజయవాడ తీసుకువెళ్లిపోమని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం చిన్న చూపు వల్ల ఈ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. ఆదేవిధంగా గన్నవరం మండలంలోని పది గ్రామాల నుంచి వైద్యం కోసం జనం రోజు ఆసుపత్రికి వస్తారు. ఓపి 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అందరూ సాధారణమైన డాక్టర్లే. స్పెషలిస్టులు లేరు. నార్మల్ కాన్పులు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వరకే ఈ ఆసుపత్రి పరిమితమైంది. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే వెంటనే అంబులెన్స్ లో విజయవాడ పంపేస్తున్నారు. ఇక సాధారణ రోగుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, సర్జన్ పోస్టులు కావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్టులతోపాటు మౌలిక వస తులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.


ప్రభుత్వం నిధులు కేటాయించాలి

శారమ్మ, ఆసుపత్రి ఇన్చార్జి

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరినట్లు ఆసుపత్రి ఇంచార్జి శారమ్మ తెలిపారు. మంచినీటి సదుపాయం కోసం మరో బోర్వెల్‌ను నిర్మించాలనీ, కరెంటు సమస్యను పరిష్కరించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కోసం ఐదు గదులు నిర్మాణం చేయాలన్నారు. కొత్తగా భవన సముదాయం కడితేనే అది సాధ్యమవుతుందన్నారు.. నిధుల లేని వల్ల ఆసుపత్రిలో కరెంటు పోతే రిపేరు చేయించడానికి రూపాయి లేని పరిస్థితి. ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ సుందర రావు సొంత డబ్బులు పెట్టి పనులు చేయించారు. స్పెషలిస్టులను భర్తీ చేయాలంటే 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలి.

ప్రత్యేక అధికారిగా రాము బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ది మచిలీపట్నం కో అపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటడ్ ప్రత్యేక అధికారిగా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాము శనివారం బాధ్యతలు చేపట్టారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో ఏర్పడిన పాలక వర్గం రాజీనామా చేయడంతో నూతన ప్రభుత్వం ఆద్వర్యంలో బ్యాంక్ కు ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా సహకార అధికారి కె.చంద్ర శేఖర్ రెడ్డి,డివిజనల్ విభాగ సహకార అధికారి బి వి. ఫణి కుమార్ ఆదేశాను సారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి రాము బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు చేపడుతున్న పి.రాము

ప్రజాదర్బారు వాయిదా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వర్షాలు కురుస్తున్న దష్ట్యా రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ నెల 21 ఆదివారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్య క్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మంత్రి కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి నిర్వహించు తేదీ తరువాత తెలియజేస్తామన్నారు.

ముంపు పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-బంటుమిల్లి : ముంపు బారినపడి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు ముంపుకు గురైన వరిపొలాలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బంటుమిల్లి మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరిపంట నీటమునిగిందని రైతులు నాయకులకు తెలిపారు. దీంతో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పెందుర్రు సమీపంలో నాగేశ్వరావుపేట ట్ డ్రైన్లో మురుగు కాలువ కలుస్తుందని, వీటిని బాగుచేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. పంటలను పరిశీలించిన వారిలో రైతు సంఘం కష్ణా జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, సిఐటియు నాయకులు మాజేటిశివ శ్రీనివాసరావు ఉన్నారు.

గుండేరులో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి- ఘంటసాల : ఘంటసాల మండలం దేవరకోట గ్రామం వద్ద ఉన్న గుండేరు డ్రైనేజీలో తూటు కాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. నియోజక వర్గంలోని డ్రైనేజీలు, పంట కాలువల్లో తూటుకాడ, గుర్రపు డెక్క అడ్డంగా ఉండడంతో వర్షపు నీరు, మురుగు నీరు, సాగునీరు పారుదల కాక రైతులు పడుతున్న ఇబ్బందులు గమనించి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించగా, కష్ణాజిల్లా కలెక్టర్ డీ.కే.బాలాజీ ప్రత్యేక శ్రద్ధతో షార్ట్ టెండర్ విధానంలో పనులు చేపట్టడంతో పనులు వేగవంతం చేశారు. మండలంలోని పలు ప్రాంతాల్లో గుర్రపు డెక్క అధికంగా ఉన్నచోట్ల ప్రోక్లెన్ సహాయంతో, పలు చోట్ల కూలీల సహాయంతో తొలగింపు పనులను ముమ్మరం చేశారు. మొత్తం పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి మండలాల మీదుగా ప్రవహిస్తున్న ఈ గుండేరు మేజర్ డ్రైనేజీ పనులను అధికారులు పర్యవేక్షించారు.





మాట్లాడుతున్న జడ్జి రియాజ్

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి - నందిగామ : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. నందిగామ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నందిగామ సబ్ జైలును జడ్జి రియాజ్ సందర్శించారు. నందిగామ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్ మాట్లాడుతూ బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ఖైదీలు సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని కోరారు. అసంఘటిత కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. సబ్ జైల్లో గల స్టోర్ రూమ్‌లో బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, కూరగాయలు మెనూ పరిశీలించారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నండ్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు, న్యాయవాది గుఱ్ఱాల వెంకటరత్నం అనంతరం సభ్యులు సూపర్డెంట్, మండల న్యాయ సేవ అధికార సంస్థ నిర్వాహకులు, మార్కపుడి గోపి, సబ్ జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనం పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం రైతు బజార్ వద్ద గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య శనివారం పరిశీలించారు. దాని నిర్వహణకు కేటాయించిన తొమ్మిది లక్షల రూపాయల నిధులకుగాను పనుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణ పార్టీ నాయకులు కలసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగా అదే రూ.5 లకు మంచి భోజనం, టిఫిన్లు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఇన్ చార్జ్ మున్సిపల్ చైర్ పర్సన్ ఓర్సు లక్ష్మి, కమిషనర్ హేమమాలిని, టిడిపి నాయకులు కౌన్సిలర్ కామసాని సత్యవతి, మండవ కృష్ణకుమారి, ఏచూరి హైమావతి, ఎ పూరి నాగేశ్వరరావు, తాజా, కొల్లూరు వెంకటేశ్వరరావు, ఉమ్మనేని విక్రమ్, కె శ్రీనివాసరావు, కొండూరు వెంకట రమణ, పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి చెందిన పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గింజుపల్లి గ్రామంలోని '2' బిట్లుకు సర్వే నెం.లు 87-3, 73 లో య.3.08 సెంట్లు, య.7.86 సెంట్లకు 2024-25 సం.ము అనగా '1' సం.ము కాలపరిమితికి సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం '5' వ సారి శనివారం గింజుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ విఎల్ ఇందిరాదత్తు అధ్వర్యంలో దేవదాయ శాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు పి.ఫణికుమార్ సమక్షంలో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాట నిర్వహించారు. సర్వే నెం.లు 87-3, య.3.08 సెంట్లకు రూ.42వేలు, 73లో య.3.08 సెంట్లు, య.7.86 సెంట్లకు రు.1.80.లక్షలు హెచ్చుపాటలు పాడారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలతదేవి తెలిపారు.

అందుబాటులోకి స్కోడా కార్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రీమియం బ్రాండ్ కార్లకు సంబంధించి స్కోడా ఇండియా కార్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు సంస్థ బ్రాండ్ డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని స్కోడా డీలర్ నందు ఎర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అద్భుతమైన డిజైన్, ఆకర్షించే భద్రతా ప్రమాణాలతో సరికొత్తగా స్కోడా కార్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డిజైన్ ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేవిధంగా కారును మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వివరాలకు నగరంలోని స్కోడా డీలర్‌లో సంప్రదించవచ్చు అని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కొలికపూడి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : మండలాభివృద్ధి విషయంలో రాజకీయాలకు చోటు లేదని, పార్టీలకతీతంగా అందరం కలిసికట్టుగా మండలాభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని తిరువూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఎ.కొండూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపిపి కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఎ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం పూర్తిగా వెనకబడి ఉందని, నియోజకవర్గంలో గిరిజనులు అధికంగా ఉన్న ఎ.కొండూరు మండలం అన్ని రంగాల్లో పూర్తిగా వెనకబడి ఉందన్నారు. కృష్ణా జలాల సమస్యను సంవత్సరం లోపు పూర్తి చేసి ప్రతి ఒక్క గ్రామానికి తాగునీటి నిమిత్తం పైప్‌లైన్ ఏర్పాటుచేస్తామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు

గ్రామాల్లో అవసరాలపై నివేదికివ్వాలన్నారు. ఎ.కొండూరు మండలాన్ని తాను దత్తత తీసుకున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రకటించారు. కంభంపాడు ఎంపిటిసి కోట పుల్లారావు ఎంఎల్‌ఎను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్యా గనియా, వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, తహశీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపిడిఒ శ్రీకృష్ణ పరమాత్మ, వైద్యాధికారి దివ్య, మండల వ్యవసాయా ధికారి షేక్ టిప్పు సుల్తాన్, ఎంఇఒ 2 కేశవరావు, విద్యుత్ శాఖ ఎఇ నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమిష్టిగా కృషి చేద్దాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - తిరువూరు : అభివృద్ధే ఎజెండాగా పార్టీలకు అతీతంగా సమిష్టిగా తిరువూరు పట్టణాన్ని సుందరవం దనంగా తీర్చిదిద్దేందుకు పనిచేద్దామని ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరి భాయి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్ ఆఫీషియో సభ్యునిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ పాలక పక్షం వైసిపి, ప్రతిపక్ష టిడిపి సభ్యులు తిరువూరు పట్టణ అభివృద్ధికి ఏర్పడుతున్న ఆటంకాలు, నిధుల కొరతపై జరిగిన చర్చను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇరుపక్షాల సభ్యులు అరోపణ, ప్రత్యారోపణలతో వాడీవేడిగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం, బోర్ మరమ్మతులు, రహదారి ఆక్రమణలు, పబ్లిక్ టాయిలెట్స్, ట్రాఫిక్ తదితర సమస్యలపై ఇరుపక్షాల సభ్యులు తన దృష్టికి తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో తిరువూరు పట్టణ, నియోజకవర్గాన్ని అభివద్ధి పరిచే కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొత్తం 20 మంది కౌన్సిలర్లు, మండలాల్లోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు మన ఊరు, తిరువూరు పేరుతో సిఎంను, పలువురు మంత్రులను, నిధుల మంజూరుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో కమిషనర్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస చర్యలకు పాల్పడుతున్న కూటమి : స్వామిదాస్

ప్రజాశక్తి - తిరువూరు : ఆచరణ సాధ్యంకాని హామీలను అమలుచేయలేక కూటమి ప్రభుత్వం విధ్వంస చర్యలకు, హత్యా రాజకీలకు పాల్పడుతుందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ ఆరోపించారు. తిరువూరులోని అయన తన నివాసంలో వైసిపి నేతలు, కౌన్సిలర్లతో కలిసి శనివారం విలేకర్ల సమావేశం నిర్వ హించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి సాధ్యం కాదని తెలుసుకున్న చంద్రబాబు వీటిపై ప్రతి పక్షాలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని రాష్ట్రంలో వైసిపి కార్యాలయాలపై, నాయకుల ఇళ్లపై దాడులు చేయిస్తూ వైసిపి కార్యకర్తలను పాశవికంగా నడిరోడ్డుపై హత్యలు చేయిస్తున్నారని స్వామిదాస్ అన్నారు. ఈ ఘటనలతో ప్రజలు పక్కదారి పట్టి హామీల అమలు గురించి మార్చిపోతారని చంద్రబాబు ఒక ప్రణాళిక ప్రకారం కుట్రలకు ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని స్వామిదాస్ విమర్శించారు. తల్లికి వందనం కోసం తల్లులు, 50 సంవత్సరాల వయసు వాళ్ళు పింఛన్ కోసం, నెలకు రూ.1500 ల కోసం 18 సంవత్సరాల మహిళలు, అన్నదాత సుఖీభవ కింద ఖరీఫ్ సాగుకు ఇస్తానన్న



మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాస్

రూ.20 వేల కోసం రైతులు, తదితర హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే వాటిని అమలు చేయలేక చంద్రబాబు ప్రభుత్వం సతమతమవుతుందని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానాలను ఏనాడు అమలు చేసిన చరిత్ర లేదని స్వామిదాస్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు చలమాల సత్యానారాయణ, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు పర్సా శ్రీనివాసరావు, సత్యనారాయణ, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాదు, మూడు దుర్గారావు, వెలుగోటి విజయ లక్ష్మి, గుమ్మా వేంకటేశ్వరి, నాయకులు కాలసాని నాగేశ్వరరావు, జాఫర్ తదితరు లు పాల్గొన్నారు.

నిధుల సేకరణలో పర్పుల్ గ్రూప్ సంస్థ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ బ్యూటీ ఫ్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన పర్పుల్ గ్రూప్ సంస్థ కన్స్యూమర్ రిటైల్ బ్రాండ్‌లను అందించేందుకుగాను ప్రత్యేకంగా నిధులను సేకరిస్తుందని సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె. సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు వెయ్యి కోట్లకు పైగా నిధులను సేకరిస్తుందని ఇందుకుగాను పలు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం పర్పుల్ గ్రూప్ డైరెక్ట్ టు కన్స్యూమర్ ప్రయివేట్ బ్రాండ్‌లను రిటైల్‌గా అందిస్తుం దన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతా లతో పాటు ఇతర ప్రాంతాలలో 1500పైగా టచ్ పాయింట్ల ద్వారా సహాయక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎపిసి సమగ్ర శిక్షా, మండల ప్రత్యేకాధికారి జి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేజ్ స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శు (గ్రేడ్ 1 టు 5)లకు సమావేశం నిర్వహించారు. మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధతో వారికి కేటాయించిన గ్రామములో మధ్యాహ్న భోజన పథకం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, గ్రామాలలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు వంటి వాటిపై దష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏం.రమేష్ బాబు, తహశీల్దార్ జి.వి.శేషగిరి రావు, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, గ్రామ స్థాయి ప్రత్యేక అధికారి, పంచయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యం కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని రైతు బజార్‌లో శనివారం సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాల కౌంటర్‌ను మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఇన్‌చార్జ్ పిడిఎస్ డిటి శ్రీరామ్మూర్తి రెడ్డి, రైతు బజార్ రమణలతో కలిసి ప్రారంభించారు. శ్రీరాం సుబ్బారావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకు కందిపప్పు కేజీ రూ.160లకు, బియ్యం 48, 49 రూపాయలు చొప్పున రెండు రకాలు విక్రయిస్తున్నట్లు, ఉపయోగించు కోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - తిరువూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహన చోదకుడు బాధ్యత వహించాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతిలాల్ నాయక్ అన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరువూరులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాద సంఘటనలో ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులే మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అపరిమిత వేగంతో వెళ్లే వారే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని జడ్జి పేర్కొన్నారు.

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌కు లేఖ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ శాంతి విషయంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిపై ఆరోపణలను లేఖలో పొందుపరిచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌కు పంపినట్లు టిడిపి ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధుల మీద విజయసాయి చేసిన వ్యాఖ్యలను, దౌర్జన్యాలపై పెద్దల సభ రాజ్యసభ గౌరవాన్ని, ప్రతిష్టను దిగజార్చేలా విజయసాయి రెడ్డి వ్యవహరించారంటూ ఫిర్యాదు చేశారు. విజయసాయిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. విజయసాయి రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపినట్లు బుద్దా వెంకన్న తెలిపారు.

విద్యార్థి అక్షితకు అభినందన

ప్రజాశక్తి - నందిగామ : అంబారుపేట గ్రామానికి చెందిన మారబత్తుల రామారావు కుమార్తె విద్యార్థి అక్షిత 2024 మే 11న ఎన్ఎంఎస్ఎస్ జాతీయస్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించి జె సిక్లీ స్కూల్ నరసాపూర్ వెస్ట్ గోదావరిలో ఎంపికైంది. విద్యార్థిని అక్షిత చందర్లపాడు మండలం ముప్పాళ్ళ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల 8వ తరగతి చదువుతుంది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సుజిని అక్షితను అభినందించారు.



కర్మోరామ్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

అనుమానిత వ్యక్తిని కుటుంబానికి అప్పగింత

ప్రజాశక్తి - గంపలగూడెం: ఇటీవల లింగాలలో అనుమానితుడుగా తిరుగుతున్న ఒక వ్యక్తిని గ్రామస్తులు గుర్తించి, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ సిబ్బందితో వెళ్లి సదరు వ్యక్తిని పట్టుకొని ఆరా తీశారు. వివరాలు అడుగుతుండగా, పొంతనలేని సమాధానాలు హిందీలో చెబుతున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఎస్ఐ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయగా, తిరువూరులో ఉన్న ఐడియాస్ స్వచ్ఛత సంస్థలో ఉంచాలనే ఆదేశాల మేరకు అతన్ని అక్కడ ఉంచారు. సదరు వ్యక్తి వద్ద ఉన్న ఆధార్ కార్డును పరిశీలిస్తే జార్ఖండ్ రాష్ట్రం కర్మోరామ్, (23)గా గుర్తించారు. అందులో ఉన్న సెల్‌ఫోన్ నెంబర్‌తో మాట్లాడి కర్మోరామ్ కుటుంబ సభ్యులను పిలిపించారు. శనివారం ఉదయం కర్మోరామ్‌ను శనివారం జార్ఖండ్ నుండి వచ్చిన కుటుంబీలకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మఠం శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని పాలేటి ఒడ్డున గల మఠం శివాలయం పునర్నిర్మాణానికి పట్టణ ప్రముఖ వ్యాపారులు బొడ్డు వెంకటేశ్వరరావు రూ.1,11,116 లు విరాళంగా ఆలయ ప్రైవేట్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, ఆలయ ప్రవేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధ్యాపకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఎన్ బి గోపాల్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల వోకేషనల్ స్టాప్ దుడ్డు కష్ణారావు, ఐ రవి శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు గరికపాటి మారుతి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని ప్రతిఒక్కరు చెత్తను రోడ్ల వెంబడి వేయకుండా అంటు వ్యాదులు రాని గుడివాడగా తీర్చిదింద్దేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే రాము పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక క్లబ్ రోడ్డులో ఐ లవ్ గుడివాడ అనే ప్రత్యేంగా శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, టిడిపి నాయకులు శ్రీకాంత్, కొడాలి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు తక్కువ ధరతో కడుపు నింపేందుకు అన్నా క్యాంటీన్‌లను ప్రారంభిస్తున్నామని వెనిగండ్ల రాము అన్నారు. శనివారం పట్టణంలోని రెండు అన్నా క్యాంటీలకు మరమ్మతులు చేసే పనులను ప్రారంభించారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధించాలని పిలుపునిస్తూ గోడపత్రికల ద్వారా ప్రచారం ప్రారంభిం చారు. శనివారం సాయంత్రం సమస్త కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి దివి లీలా కష్ణ ఆధ్వర్యంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీలా కష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ద్వారా క్యాన్సర్ వ్యాధులకు గురవుతున్నారని, క్యాన్సర్ నివారించాలంటే మొదట ప్లాస్టిక్కు నివారించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడటం వల్ల చర్మవ్యాధులు హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడంతో పాటు వినికిడి సమస్య దష్టిలోపం కూడా వస్తున్నదని తెలిపారు. పాలిథిన్ కవర్ల వాడకం ఇదే విధంగా కొనసాగితే మరో 25 సంవత్సరాలకు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితులు ఏర్పడతా యన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డి కష్ణ బం డే శ్రీనివాసరావు, అలపర్తి గోపాలకష్ణ, యా సం శోభన్ బాబు, దామర్ల రాజా పాల్గొన్నారు

టిడ్కో గృహాలకు తాగు నీరందించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో గృహాల లబ్ధిదారులు గత ఐదురోజుల నుండి తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు అక్కడి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ వెనిగండ్ల రాము హెచ్చరించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో కాంట్రాక్టర్లు, టిడ్కో అధికారులు, మున్సిపల్ అధికారులతో వెనిగండ్ల రాము సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10రోజుల్లో టిడ్కో యాజమాన్యం, మున్సిపాలిటి అధికారులు పరస్పర అవగాహనతో టిడ్కో గృహాల తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చాలన్నారు. అంతే కాకుండా టిడ్కో అధికారులు పూర్తిస్థాయిలో టిడ్కో గృహాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు తులసీ, శ్రీకాంత్ రామరాజు, రమేష్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటన లో తెలియచేశారు. ఉదయం 09.30 గంటలకు స్థానిక ఈడేపల్లి లోని బెల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చారనీ, గత 2 సంవత్సరాల కాలంలో తమ సంస్థ ద్వారా సుమారు 700 కు పైగా యూనిట్స్ రక్తాన్ని అత్యవసర సమయాల్లో దాతల సహకారంతో అందించామని తెలిపారు. మనం ఒక్కసారి ఇచ్చే రక్తం మరో ముగ్గురి ప్రాణాలను కాపాడతుందని, ప్రతి ఇంటిలో ఒక రక్తదాతను సమాజ సేవకునిగా తయారు చేయటమే మా లక్ష్యం అని తెలిపారు. ఎవరైనా రక్త దానం చేయదలిస్తే మైత్రీ ఫౌండేషన్ నెంబర్ 7799077798 కి ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవచ్చని తెలియజేసారు.

కవి సూర్యనారాయణకు సన్మానం

ప్రజాశక్తి-మోపిదేవి : దివిసీమ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, ప్రముఖ కవి గొరిముచ్చు సూర్య నారాయణను మోపిదేవి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మోపిదేవిలో శనివారం ఉదయం ఘనంగా సన్మానిం చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఇటీవల నిర్వహించిన కవితల పోటీలలో దివిసీమ ప్రాంతానికి చెందిన కవి గొరిముచ్చు సూర్యనారాయణ రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించి, నగదు అవార్డు గెలుచుకున్నారు. పాత్రికేయునిగా మోపిదేవి మండలంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సూర్యనారాయణను మోపిదేవి పాత్రికేయులు నిర్వహించిన కార్యక్రమంలో చల్లపల్లి ఎస్టేట్ దేవాల యాల కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సూర్యనారాయణ ను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి, అవనిగడ్డ పాత్రికేయులు టిడిపి, జనసేన నాయకులు, మోపిదేవి గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిక

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్లో కాళీ బేకరీ యజమాని పి.కోటి ఆధ్వర్యంలో జనసేన పార్టీ లో చేరారు. శనివారం మచిలీపట్నం కార్యాలయంలో ఇంచార్జ్ బండి రామకష్ణ ఆధ్వర్యంలో చేరారు. కోటి వెంట పలువురు కూడా జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన అర్బన్ సిఇఒ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ అర్బన్ బ్యాంక్ ఇంచార్జ్ విజయ్ కుమార్ శనివారం నూతనంగా బాధ్యతలు తీసుకుని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావులను మార్యాదపుర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, కృష్ణా జిల్లాలోని ప్రత్యేకంగా నిలిచిన అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు తులసీ, శ్రీకాంత్, కొడాలి రామరాజు, రమేష్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం(హనుమాన్ జంక్షన్) : బాపులపాడు మండలం వీరవల్లి ఆర్ పి హెచ్ కాలనీ, కుమ్మరి కాలనీల్లోని అంగన్వాడీ చిన్నారులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మొక్కులు పెంచడంపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. పిల్లలు అందరికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు..ఆహారం తీసు కునే ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకో వాలన్నారు. రెండు పూటలా తప్పనిసరిగా స్నానం చేస్తే ఏటువంటి వ్యాధులు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. పాఠశాల ఆవరణలో పిల్లలు చేత మొక్కులు నాటించారు.. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎం లు కమలకుమారి , నాగమణి, అంగన్వాడీ వర్కర్లు హేమలత , రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మంత్రి కొల్లును కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆర్. గంగాధ రరావు రాష్ట్ర గనులు ,భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలి శారు. ఒక మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



మంత్రికి మొక్క అందిస్తున్న ఎస్‌పి

జనసేన సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గుడివాడ నియోజకవర్గం లో 6 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నట్లు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పేర్ని జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం గుడ్లవల్లేరు లో మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో 52 మంది వాలంటీర్లతో క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం 3 వేల క్రియాశీల సభ్యత్వాలు నమోదు కాగా ఈ సంవత్సరం 6వేల సభ్యత్వాలను నమోదు చేస్తామని తెలిపారు. ఈ సభ్యత్వాల వల్ల జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ, గుడివాడ టౌన్, గుడ్లవల్లేరు, నందివాడ, మండలాల ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు.

పలువురికి కొనకళ్ల పరామర్శ

ప్రజాశక్తి- ఘంటసాల : ఘంటశాల మండలం లంకపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యం తో మరణించిన పలువురు టీడీపీ సానుభూతిపరుల కుటుంబ సభ్యులను కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు శనివారం పరామర్శించారు. నారాయణరావు లంకపల్లి గ్రామంలోని వీరమాచినేని అంకినీడు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు నాని చిన్నిలను, గువ్వాబత్తిన అనసూర్య కుమారుడు మాజీ ఎంపీటీసీ సభ్యులు గువ్వాబత్తిన నాగేశ్వరరావు, గువ్వాబత్తిన సాయి కుటుంబ సభ్యులను, పరిశె వీరుళ్ళు(కల్లుగీత కార్మికుడు) కుమారులు పరిశె శ్రీనివాసరావు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేసారు. కొనకళ్ళ నారాయణరావుతో పాటు వారి వెంట యార్లగడ్డ సీతారామయ్య అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సిసెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, గ్రామపార్టీ అధ్యక్షులు కొమ్మారెడ్డి లీలాకష్ణ పాల్గొన్నారు

పారిశుధ్య చర్యలు చేపట్టండి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజక వర్గంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వీటి నివారణకు గ్రామాల్లో యుద్ధప్రతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులు ఆదేశించారు. శనివారం ఆయన తన నివాసం నుండి గన్నవరం నియోజకవర్గం లోని 4 మండలాల ఎమ్మార్వోలు ఎండిఓలు, వ్యవసాయశాఖ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలో భారీ వర్షాల ప్రభావంపై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల్లో పూడిక తీసి మురుగునీరు నిలవకుండా చూడాలన్నారు. డ్రైనేజీల పూడిక తీత పనులకు నిధుల కొరత ఉంటే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే డ్రైనేజి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పారిశుధ్య చర్యలు చేపట్టి, దోమల నివారణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పంచాయతీల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో బ్లీచింగ్ చల్లాలన్నారు.

సబ్సిడీ సరుకులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చల్లపల్లి.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను సద్విని యోగం చేసుకోవాలని చల్లపల్లి తహసీల్దార్ బీ.సుమతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. చల్లపల్లి రైతు బజారులో ఏర్పాటు చేసిన కేంద్రంలో 113 మంది 1,245 కేజీలు రా రైస్, 34 మంది 385 కేజీల స్టీమ్ రైస్, 173 మంది 146 కిలోల కందిపప్పు కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని రిలయన్స్ స్మార్ట్ బజారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా 24 మంది 50 కిలోల రా రైస్, 46 మంది 74కిలోల స్టీమ్ రైస్, 72 మంది 84 కేజీల కందిపప్పు కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో బీపీటీ, స్వర్ణ మసూరి రా రైస్ కేజీ రూ.48, స్టీమ్ రైస్ కేజీ రూ.49, దేశవాళి కందిపప్పు కేజీ రూ.160లకు అందిస్తున్నట్లు వివరించారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడు రైతు బజార్లో గల ప్రత్యేక కౌంటర్ ద్వారా దేశవాళీ కందిపప్పు ధర కేజీ ఒక్కింటికి నాణ్యమైనరూ. 23 స్టీమ్ రైస్ (బి.పి.టి/సోనా మసూరి రకం) కేజీ చొప్పున (బి.పి.టి/సోనా మసూరి రకం) కేజీ రూ.48 చొప్పున వినియో గదారులకు అందిస్తున్నట్లు కంకిపాడు మండల తాసిల్దార్ రామకష్ణ తెలియజేశారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించు కోవాలని ఆయన కోరారు. కందిపప్పు, బియ్యము కొనుగోలులో వినియోగదారులు ఏదైనా అసౌకర్యానికి గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు ద్వారా తెలియచేయవచ్చునన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు** : ఉయ్యూరు రైతుబజార్లో బియ్యం, కందిపప్పు రాయితీపై విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్ ప్రారభించినట్టు మండల తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి శనివారం ఓప్రకటనలో తెలిపారు. దేశవాళీ కందిపప్పు కేజీ రూ.160, నాణ్యమైన స్టీమ్ రైస్ (బీపీటీ, సోనామసూరి) కేజీ రూ. 49, ముడిబియ్యం రూ.48 చొప్పున వినియోగదారులకు సరఫరా చే స్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు, బియ్యంకు కొనుగోలుకు సంబంధిం చి వినియోగదారులకు ఏదైనా అసౌకర్యం కలిగితే సంబంధిత అధికారులకు తెలియచే యాలని పేర్కొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పెరుగుతున్న ధరలకు అదుపులో చేయాలనే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బిపిటి బియ్యం, కందిపప్పు తక్కువ ధరకే అందిస్తున్నట్లు పమిడిముక్కల తహసీల్దార్ కెవివి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని వీరంకిలాకు యూని యన్ బ్యాంక్ దగ్గర ఉన్న శ్రీ దుర్గా భవాని జనరల్ స్టోర్స్‌లో దేశవాళీ కందిపప్పు కేజీ 160 రూపాయలు, బీపీటీ బియ్యం కేజీ 49 రూపాయలకే అమ్మకాలను ప్రారంభించారు. మండలంలోని ప్రజలు దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆర్ఐ ఏసు పాదం పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో రాయితీ సరుకులు అందజేస్తున్న దృశ్యం

మంత్రికి విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గ్రామ రెవెన్యూ సహాయకులుకు శాశ్వత పే స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు విఆర్‌ఎవస్ జెఎసి నగరంలోని మంత్రి కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసి డెంట్ అనకాపల్లి లోవరాజు, కోశాధికారి నం ద్యాల నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న రూ.11 వేలు వేతనంతో కుటుంబం గడవడం కష్టమన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వేతనాలు పెంచడంతో పాటు, శాశ్వత పే స్కేల్ అమలు చేయాలని కోరారు.

ప్రపంచ చదరంగం దినోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జిల్లా క్రీడా విభాగం ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ పోటీ పోటీలు నగరంలోని ఫంటెన్స్ వేదికగా అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ పోటీలో ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులు ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్, అట్లూరి సుధారాణి పాల్గొని క్రీడాకారులకు వారి అమూల్యమైన సందేశాన్ని క్రీడాకారులకు తల్లిదండ్రులకు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు, విద్యార్థులకు రూ.30 వేలు నగదు ప్రోత్సాహంతో పాటు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఫన్ టైమ్స్ యాజమాన్యం అట్లూరి సుమ బిందు, కిలారు వెంకట శివాజీ, ముప్పవరపు సతీష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ కాసిం, మందుల రాజీవ్ పాల్గొన్నారు. విజేతలు ఎం.నిరంజన్ 6.5/7 పాయింట్లతో ప్రథమ, అభిరామ్ వడ్డీ 6/7 పాయింట్లతో ద్వితీయ, పొట్లూరి సుప్రీత 6/7 పాయింట్లతో పాండ్లతో తృతీయ స్థానంలో నిలిచారు.

ముందుకు సాగని స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ

డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షాలకే విజయవాడ నగరం చిత్తడిగా మారింది. ఐదారు సెంటీమీటర్ల నుంచి ఆపైన పెద్ద వర్షం కురిస్తే ఇక నగరం పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ముసురు పట్టి నాలుగు రోజులకు పైగా కురుస్తున్న వర్షాలకే లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతూ, డ్రెయిన్లు పొంగిపొర్లుతూ, రహదారులపై వర్షపు నీరు తటాకాలుగా దర్శనమిస్తున్నాయి. ఎగువ ప్రాంతం నుంచే గాక, నగరంలో పడే వర్షపు నీరు చుక్క నిలబడకుండా సాఫీగా వెళ్లిపోయే విధంగా, నగరం ముంపు బారి నుంచి కాపాడుకునే విధంగా "స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ" వ్యవస్థ అనే ఒక పెద్ద ప్రాజెక్టును డిజైన్ చేసి, దానికి రూ.461 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి 2016-17లోనే రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటి టిడిపి ప్రభుత్వమే ఆనాడు కూడా అధికారంలో ఉంది. కానీ ఈ మధ్యలో రెండు ప్రభుత్వాలు మారిపోయినా స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్ 40 శాతం లోపే పూర్తి అయిందని విపక్షాలు విమర్శిస్తుండగా, 60 శాతం పూర్తి అయినట్లు ప్రజారోగ్య సాంకేతికశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ స్కీమ్ ప్రాధాన్యత నగరానికి ఎంత అవసరమో...ఆ స్థాయిలోనే అనేక అరిష్టాలు కూడా ఎదుర్కొంటూ... ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది.

నగరంలో 443 కిలోమీటర్ల పొడవున స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు నిర్మించాల్సి ఉండగా, 253 కిలోమీటర్లు పొడవునా డ్రెయిన్ల నిర్మాణం జరిగినట్లు ప్రజారోగ్య సాంకేతిక శాఖ అధికారులు వివరిస్తున్నారు. 142 కిలోమీటర్లు పొడవున మేజర్, మరో 301 కిలోమీటర్ల పొడవునా మైనర్ డ్రెయిన్ల నిర్మాణం పనులు జరగాల్సి ఉండగా, 66 కిలోమీటర్ల పొడవున మేజర్, మరో 187

7 వీక్షణం

కిలోమీటర్ల పొడవున మైనర్ డ్రెయిన్ల నిర్మాణం జరిగినట్లు 60 శాతం పనులు పూర్తి కాగా, మరో 40 శాతం పనులు పూర్తి కావాల్సి ఉందని సంబందిత అధికారులు వివరిస్తున్నారు. 190 కిలోమీటర్ల పొడవున డ్రెయిన్ల నిర్మాణమే జరగలేదు. సదరు కాంట్రాక్టర్ ఎల్ అండ్ టి కంపెనీకి రూ.187 కోట్లు బిల్లులు చెల్లించగా, మరో రూ. 25 కోట్ల వరకు బిల్లులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని అధికారిక సమాచారం. పనులు పూర్తి చేయాలంటే ఈ డ్రెయిన్ల నిర్మాణం జరిగే ఏరియాల్లో నేటికీ కల్వర్టులు, విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్స్, విద్యుత్ పోల్స్ తొలగించాల్సినవి వందల సంఖ్యలోనే ఉన్నాయి. వాటి గురించి పట్టించుకునే పరిస్తితి లేకుండా పోయింది. డ్రెయినేజి స్కీమ్ ప్రారంభమైన 2017లోనే ఆదిలోనే హంసపాదులాగా... ప్రాజెక్టు నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతను విజయవాడ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంనకు అప్పగించకుండానే ...నగరం బౌగోళిక స్వరూపం అసలు తెలియని, సిబ్బంది, అధికారుల కొరతగా ఉన్న ప్రజారోగ్య సాంకేతికశాఖకు పర్యవేక్షణ బాధ్యతలను ఇప్పటి మునిసిపల్ శాఖామంత్రిగా ఉన్న పి.నారాయణ ఆనాడు కూడా ఇదే శాఖామంత్రిగా ఉండి, వేరే డిపార్టుమెంట్‌కు కేటాయించడం పట్ల ఆనాడే స్థానిక నగరపాలక సంస్థలోని టిడిపి పాలకవర్గం, అప్పటి మేయర్‌గా ఉన్న కోనేరు శ్రీధర్ తీవ్ర స్థాయిలో వ్యతిరేకించిన అనుభవం కూడా లేకపోలేదు. అయినా పట్టుబట్టి వేరే శాఖకు కేటాయించడమే గాక, ఈ నిర్మాణ పనులను పూర్తి చేయించే బాధ్యత ఎల్ అండ్ టి కంపెనీకి అప్పగించి, నిధులు కూడా సక్రమంగా విడుదల కాకపోవడంతో... ఆనాటి టిడిపి కాలంలోనే పనులు నత్తనడకన సాగాయి. గత వైసిపి ప్రభుత్వం ఈ స్కీమ్‌కు సంబంధించిన రూ. 289 కోట్లను వేరే అవసరాలకు మళ్లించడం పట్ల కూడా విఎంసిలోని విపక్షాల నుంచి కూడా తీవ్రమైన విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రసన్న వెంకటేష్ ...విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న కాలంలో గత వైసిపి ప్రభుత్వం కాలంలో మూడేళ్ల క్రితం ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌కు సంబంధించి పర్యవేక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించి, నిధులు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రాసిన లేఖకు నేటికీ అతీగతీ లేకుండా పోయింది.

- రాజు


జగ్గయ్యపేటలో నిండిన చెరువు

ముసురుతో రోడ్లు, పంటలు మునక

ఇళ్లల్లోకి చేరిన నీరు - పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు
- కొన్నిచోట్ల ఇళ్లకు పొంచి ఉన్న ప్రమాదం

విజయవాడ : కురుస్తున్న వర్షాలకు రావిచెట్టు సెంటర్ చలసాని వారి వీధిలో గల సాగర్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయే స్థితిలో ఉందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సిపిఎం మొగల్రాజపురం కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పరిస్థితిని తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ, తూర్పు సిటీ నగర సెక్రటేరియట్ సభ్యుడు క్రాంతికుమార్, నగరకమిటీ సభ్యులు మురహరిరావు, స్టాలిన్, నాయుడు, పరసా కిరణ్, మంగమ్మ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మున్సిపల్ ఇఇకి, తూర్పు తహశీల్దార్‌కు తెలిపారు. వెంటనే 6వ డివిజన్ విఆర్‌ఓ వచ్చి పరిశీలించారు. మున్సిపల్ అధికారులను సంబంధిత స్థలానికి పరిశీలన నిమిత్తం పంపుతున్నట్లు ఇఇ తెలిపారు.

ఇళ్లల్లోనే మురుగునీరు

విజయవాడ : విజయవాడ రాణిగారితోటలో సిపిఎం నాయకులు పర్యటించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ మురుగు నీరు ఇళ్ళలోకి వచ్చి చేరుతోంది. వాటి మధ్యే జీవనం కొనసాగించే పరిస్థితి ఉంది. ఈ సందర్భంగా పరిశీలించిన సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కృష్ణ మాట్లాడుతూ తారకరామానగర్‌లో మురుగునీరు వెళ్లే దారిలేక ఇళ్లలోకి నీరు వస్తుందన్నారు. దీనికి వర్షపు నీరు తోడయిందని, కాల్వల్లో చెత్త పేరుకుపోయిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికార యంత్రాంగం కదిలి ఈ సమస్య పరిష్కరించకుంటే ప్రజలు చేసే ఆందోళనలకు మీరే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు తమ్మిన చంద్రశేఖర్, స్థానిక నాయకులు వై.కృష్ణ, కందుకూరి వెంకటేశ్వర్లు, ఆదామ్, ఈశ్వర్ రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

45వ డివిజన్ కొండ ప్రాంతంలో కూలిన ప్రహరీ గోడ

భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ కబేళా సెంటర్ తిరుపతమ్మ గుడి ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో కొండ ప్రాంతంలో గోడ కూలిపోయి, పాక్షికంగా దెబ్బతిన్నాయి. వల్లభాపురం కోటేశ్వరరావుకు చెందిన ఇంటి సామాగ్రి, ఇల్లు ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పరిశీలించి, బాధితులను పరామర్శించారు.

కంచికచర్ల : గడచిన 24 గంటల్లో అత్యధికంగా కంచికచర్ల మండలంలో 69.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నందిగామలో 54.6, వీరులపాడులో 44.6, చందర్లపాడులో 53.0, జగ్గయ్యపేటలో 35.6, వత్సవాయిలో 54.6, పెనుగంచిప్రోలులో 23.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీనికి తోడు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నందిగామ నియోజకవర్గ పరిధిలో వాగులు వంకలు పొంగాయి. కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద శనివారం లక్ష్మయ్య వాగుకు వరద చేరింది. వాగులో 5 అడుగువ మేర నీరు ప్రవహించింది. దీంతో చెవిటికల్లు - కంచికచర్ల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరు, కట్టెలేరు, వైరా ఏరులకు వరద నీరు చేరింది. కీసర మునేరు కు వరద పెరిగి, కష్ణానదికి వర ప్రవాహం పెరిగింది. ఎడతెరపి లేకుండ కురిసిన వర్షానికి మండల పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమరమయ్యాయి. స్థానిక అరుంధతి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు ఇళ్లు ముంచెత్తుందనే భయంతో రెండు రోజులగా కాలనీవాసులు కంటిమీద కునుకు లేకుండా రాత్రిపూట జాగారం కాశినట్లు వాపోయారు. కాలనీలో రోడ్లు నీటమునిగి వరద ఇళ్లల్లోకి చేరటంతో కొందరు నీటిని ఎత్తిపోశారు. శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది మోటార్ల తో కాలనీలో నిల్వ చేరిన వరద నీటిని బయటకు పంపారు. భారీ వర్షాలకు కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మెట్ట పంటలైన పెసర, మొక్కజొన్న, పత్తి పొలాల్లో నీరు నిలబడినట్లు రైతులు అంటున్నారు. మెట్ట పొలాల్లో నీరు నిల్వ దిగుబడిపై ప్లభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీట మునిగిన పెసర, పత్తి...

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎడతెరపి లేకుండ కురుస్తున్న భారీ వర్షాలకు కంచికచర్ల. వీరుల పాడు మండలాల్లో మెట్ట పంటలు నీట మునిగాయి. నాలుగు రోజులగా ముసురు పట్టి తెలపిలేకుండా వాన కురుస్తునే ఉంది. దీంతో శనివారం ఈ ప్రాంతంలో వాగులు, వంకలు, కాలువలకు వరదనీరు చేరింది. కంచికచర్ల, పరిటాల, చెవిటికల్లు, మోగులూరు, జగన్నాథపురం, జుజ్జూరు తదితర ప్రాంతాల్లో పత్తి, పెసర, మొక్కజొన్న పంటలు నీటమూనిగాయి. మెట్ట పొలాల్లో నీరు పారటంతో మొక్కలు నాని కుళ్లిపోతాయని, కలుపు పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రెడ్డిగూడెంలో చిత్తడిగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు

రెడ్డిగూడెం : మండల పరిధిలోని విజయవాడ - విస్సన్నపేట ఆర్‌అండ్‌బి రహదారి సీతారాంపురం స్టేజీ నుంచి మద్దులపర్వ మధ్య అధ్వానంగా మారిన తారు రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. ఆరేళ్ల నుంచి ఎంతో ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుకు మరమ్మతులు ప్రారంభించడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కేవలం ప్యాచ్‌వర్కు మాత్రమే కాకుండా పూర్తిగా ఈ రోడ్డును ఆధునీకరణ చేయాలని ప్రజలందరూ కోరుతున్నారు. **మైలవరం :** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మైలవరంలోని దేవుని చెరువు, ఎన్టీఆర్ కాలనీలో డ్రైన్లు పూడుకుపోయి రహదారిపైకి వర్షపు నీరు మురుగునీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికులు తమ ఇబ్బందులను టిడిపి దృష్టికి తీసుకెళ్లగా శనివారం జెసిబిని ఏర్పాటు చేసి డ్రైన్లలో పూడికలు తీయించి మురుగు, వర్షపు నీరు పారుదల అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు లంక లితీష్ వార్డ్ మెంబర్ దుర్గారావు, మల్లెల రాధాకష్ణ, తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.



కంచికచర్లలో ఇళ్లలోకి చేరిన నీరు


వన్‌టౌన్లో విరిగిపడిన కొండ చరియలు

జగ్గయ్యపేట : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక 10వ వార్డ్ చిరునగర్‌లో అండర్ డ్రైనేజీలో చెత్తాచెదారం మురికినీరు పేరుకుపోవడంతో ఇళ్లల్లో వాడిన నీరు మరల వెనక్కి తన్నడంతో శనివారం ఉదయం చిరునగర్‌లో పురపాలక సంఘం యుద్ధ ప్రాతి పదికన చర్యలు చేపట్టింది. చిరునగర్ వాసులు వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి దృష్టికి సమస్యను తీసుకురావడంతో ఆమె వెంటనే చిరునగర్‌ను సందర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే కమీషనర్ నాగమల్లేశ్వరరావుతో ఫోన్‌లో తెలిపారు. ఆయన మున్సిపల్ డీఈఈ శివ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌లతో చర్చించారు. సమస్యను తక్షణం పరిష్కరించేందుకు ఉదయం 7:30 గంటలనుండి సెప్టిక్ ట్యాంకర్‌తో డ్రైనేజ్ చెత్తాచెదారం, మురికి నీరంతా తోడి జనావాసాలకు దూరంగా తరలించారు. షేర్ మహమ్మద్ పేట, మల్కాపురం, గౌరవరం తదితర గ్రామాల్లో గల చెరువులు వర్షపు నీటితో జలకళ సంతరించుకున్నాయి. ఇప్పటివరకు సరైన వర్షపాతం లేకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్ మెట్ట పైర్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని అనుకున్న రైతులకు ఈ వర్షాలు భూగర్భ జలాలు పెరగటంతో ఈ ఖరీఫ్ సీజన్ వ్యవసాయం ఆశాజనకంగా ఉంటుందని రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రాణిగారితోటలో మురుగుతో నిండిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు